క్లుప్తంగా

14వ డివిజన్‌లో గడపగడపకూ కాంగ్రెస్



ప్రచారం చేస్తున్న మువ్వా విజయ్‌బాబు

ఖమ్మంఅర్బన్: గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యక్రమాన్ని ఆ పార్టీ మేనిఫెస్టో సభ్యుడు మువ్వా విజయ్‌బాబు ఆదివారం నగరంలో కొనసాగించారు. 14వ డివిజన్‌లో గొల్లగూడెం తదితరకాలనీల్లో ప్రచారం నిర్వహించారు. ప్రతి గడపకూ తిరుగుతూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అమలు చేయబోయే సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌బాబు మాట్లాడుతూ ఖమ్మం నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్ కట్టుబడి ఉంటుందన్నారు. అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలోని అన్ని ప్రధాన సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పలువురు డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్ మృతికి సంతాపం

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా కేంద్రంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీపతి లక్ష్మణ్ (36) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషయ్య మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. కార్పొరేటర్ కన్నం ప్రసన్నకృష్ణ, డీసీసీబీ ఉద్యోగులు కూడా నివాళులర్పించారు.

ఆలయ నిర్మాణానికి రూ.25 వేలు విరాళం



పూజ చేస్తున్న రాయల నాగేశ్వరరావు

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి దేవాలయం, పాండవుల దేవాలయానికి రూ.25 వేల విరాళాన్ని టీపీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు అందించారు. ఆదివారం దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బోదులబండ సొసైటీ వైస్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బయ్య ఇటీవల అనారోగ్యానికి గురికాగా కోరట్లగూడెం వెళ్లి ఆయన్ను పరామర్శించారు. కార్యక్రమంలో బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజిని, యడవల్లి నాగరాజు, పగిడికత్తుల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలి..



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ నాయకుడు

కామేపల్లి(కారేపల్లి): ఆగస్టు గడిచిపోయి 10 రోజులైనా ఇంకా ప్రభుత్వం ఉపాధ్యాయులకు వేతనాలు విడుదల చేయక పోవటం బాధాకరమని పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు గుడిపూడి శ్రీనివాసరావు, పి.రాములు పేర్కొన్నారు. ఆదివారం కామేపల్లిలో పీఆర్‌టీయూ మండల సమావేశం నిర్వహించగా వారు మాట్లాడారు. వేతనాలు సకాలంలో రాకపోవడంతో బ్యాంకు రుణ వాయిదాలు చెల్లించలేకపోతున్నామని, అదనపు చార్జీలు పడుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పోట్ల నాగేశ్వరరావు, నాగిరెడ్డి, ఎస్.వెంకటేశ్వర్లు, డి.వెంకటేశ్వర్లు, మురళీరెడ్డి, మాళిక, వాణి, గంగ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల యూనిట్లు పరిశీలన

నేలకొండపల్లి: ప్రభుత్వం అందించిన గొర్రెల యూనిట్లను ఆదివారం ఎంపీడీఓ కె.జమలారెడ్డి, మండల పశువైద్యాధికారి సంజయ్‌రెడ్డి పరిశీలించారు. మండలంలోని ఆచార్లగూడెంలో 13 యూనిట్లు, సుర్దేపల్లిలో 29 యూనిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. యూనిట్లతో ఆర్థిక స్వాలంబన సాధించాలని సూచించారు. గొర్రెలను విక్రయించకుండా, ఆదాయ వనరులుగా చూసుకోవాలని పేర్కొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ఖుషి
వినోద	జవాన్(హిందీ), జైలర్
సాయిరాం	మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి
ఆదిత్య	ఓఎంజీ-2 (హిందీ)
శ్రీనివాస	జవాన్
సుందర్	తురుంఖాన్‌లు

- ఖమ్మంవ్యవసాయం

జంక్షన్‌లో జాం

- రూ.లక్షలు వెచ్చించారు.. వదిలేశారు
- ప్రమాదకరంగా ఇందిరానగర్ జంక్షన్
- రోడ్డుపైనే పార్కింగ్, దుకాణాలు
- తరచుగా ప్రమాదాలు.. గాయపడుతున్న పలువురు





లింక్ రోడ్డుకు ఇరువైపులా నిలిపిన ద్విచక్రవాహనాలు (ఇన్‌సెట్) ఇటీవల జంక్షన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో దెబ్బతిన్న ద్విచక్రవాహనం

ఖమ్మంఅర్బన్: జిల్లా కేంద్రాల్లో నిత్యం రద్దీగా ఉండే వాటిల్లో ఇందిరానగర్ జంక్షన్ ఒకటి. ఇందిరానగర్ నుంచి బైపాస్‌కు వెళ్లడానికి ఇబ్బంది లేకుండా రెండేళ్ల కిందట రూ.లక్షలు వెచ్చించి సీసీ రోడ్డు నిర్మించి వైరా రోడ్డుకు లింక్ చేశారు. ఆ తర్వాత మాత్రం ఈ రహదారిని ఎవరూ పట్టించుకోలేదు. దీంతో రహదారికి ఇరువైపులా వాహనాల పార్కింగ్‌తో రోడ్డు కుచించుకుపోయింది. అలాగే, నిబంధనలకు విరుద్ధంగా రాంగ్ రూట్‌లో వచ్చివెళ్తున్న వారితో తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇదంతా అందరి కళ్ల ముందే జరుగుతున్నా అటు కేఎంసీ, ఇటు ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడంతో సమస్య నానాటికీ తీవ్ర రూపం దాలుస్తోంది.

కేఎంసీ 10వ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్ జంక్షన్‌కు ఒక వైపు పార్కు, మరో వైపు వస్త్ర దుకాణం ఉండగా.. ఆ పక్కనే మమత ఆస్పత్రి రోడ్డు, ఇటు వైపు ఇందిరానగర్‌కు రాకపోకలు సాగించే వారితో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ రద్దీ కారణంగా ఇబ్బంది ఎదురుకాకుండా కార్పొరేషన్ నిధులతో సీసీ రోడ్డు వేయించారు. కొన్ని రోజుల వరకు బాగానే ఉన్నా ఆ తర్వాత నుంచి లింక్ రోడ్డుకు ఇరువైపులా ఇతర ప్రాంతాలకు వెళ్లే వారు తమ ద్విచక్రవాహనాలు, కార్లను పార్కింగ్ చేయడం మొదలుపెట్టారు. దీంతో రహదారి కాస్తా పార్కింగ్ అడ్డాగా మారగా.. వైరా రోడ్డు నుంచి బైపాస్‌కు వెళ్లే వాహనదారులు లింక్ రోడ్డు వైపునకు వచ్చే క్రమాన ఎదురుగా వచ్చే వాహనాలతో ముప్పు ఎదుర్కొంటున్నారు. ఈ జంక్షన్‌లో ఆర్టీసీ బస్సుల స్టాప్ కూడా ఉండటంతో ప్రమాదాలకు మరో కారణమవుతోంది. కొన్నాళ్ల కిందట బస్సులను ఇక్కడ ఆపకుండా కాస్త ముందు పర్ణశాల ఆలయం వద్ద ఆపాలని సూచించారు. అయితే, ఇది అమల్లోకి రాకపోవడంతో ప్రమాదాలు షరా మామూలయ్యాయి. ఇదే ప్రాంతంలో ప్రభుత్వ పాఠశాల, మరో వైపు పబ్లిక్ టాయిలెట్లు, ఇంకోవైపు దేవాలయం కారణంగా రద్దీ పెరుగుతోంది. అలాగే రామాలయం ముందు నుంచి వేసిన ఇందిరానగర్, రామాలయ లింక్ సీసీ రోడ్డు సైతం పార్కింగ్, దుకాణాదారుల ఆక్రమణలతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. ఇకనైనా ట్రాఫిక్ పోలీసులు, కార్పొరేషన్ అధికారులు స్పందించి జంక్షన్‌లో జగడం లేకుండా, ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

నగరం నలుదిక్కులా అభివృద్ధి చేశాం..

ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్



చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి అజయ్ తదితరులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని ప్రతీ డివిజన్‌లో ప్రజలకు కావాల్సిన మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. రఘునాథపాలెంలో ఛావా రాము ఆధ్వర్యాన ఆదివారం జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం అనేక మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలవగా, ఇక్కడి అభివృద్ధిని నమూనాగా తీసుకుంటున్నారని తెలిపారు. ఈ అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు.

ఖమ్మంస్పోర్ట్స్: నగరంలోని జూబ్లీక్లబ్‌లో ఇటీవల చేపట్టిన పనులను పువ్వాడ అజయ్‌కుమార్ ప్రారంభించారు. దాదాపు రూ.14 లక్షల వ్యయంతో ఆధునికీకరించడం అభినందనీయమన్నారు. ఆ తర్వాత జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ప్రస్తుత కార్యవర్గాన్ని మరో ఏడాది పొడిగిస్తూ తీర్మానించారు.

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మంమామిళ్లగూడెం: నిజాంపాలన, దేశ్‌ముఖ్‌ల ఆగడాలకు వ్యతిరేకంగా పోరాడిన యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ అని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కొనియాడారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యాన జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి వద్ద చాకలి ఐలమ్మ వర్ధంతి సభలో ఆమె విగ్రహానికి మంత్రి నివాళులర్పించి మాట్లాడారు. కాగా, లకారం ట్యాంక్ బండ్‌పై చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ ఆధ్వర్యాన మంత్రి పువ్వాడకు వినతిపత్రం అందజేశారు. ఇక ఖమ్మం నగర విశ్వ బ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం ప్రమాణ స్వీకార సమావేశంలో మంత్రి పాల్గొని నూతన పాలకవర్గాన్ని అభినందించారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, డీసీసీబీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, విజయ్‌కుమార్, మేయర్ పి.నీరజ, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జి.జ్యోతి, జూబ్లీ క్లబ్ కార్యదర్శి పోట్ల శ్రీకాంత్‌తో పాటు ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, నాయకులు మండేపుడి జగదీష్, మద్దినేని వెంకటరమణ, వల్లభనేని రామారావు, క్లైమెంట్, దండా జ్యోతిరెడ్డి, పగడాల నాగరాజు, గుండాల కృష్ణ, ఈదయ్య, మాధవి, మోడేపల్లి కృష్ణమాచారి, లింగబోయిన పుల్లారావు, కొత్తకొండ్ల లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలి



నేలకొండపల్లి: నివాళులర్పిస్తున్న నాయకులు



తిరుమలాయపాలెం: నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నేలకొండపల్లి: చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలని బీసీ జేఏసీ పాలేరు డివిజన్ అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ పిలుపునిచ్చారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దేవరశెట్టి రాము, అన్నవరపు రాములు, తోగటి నాగాచారి, పి.సూరిబాబు, ఉపేంద్రచారి, కె.గోపి, జిడుగు వెంకటనారాయణ, గణేశ్, కోటేశ్వరరావు, కంది రామకృష్ణాచారి పాల్గొన్నారు. సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కేవీ రెడ్డి, ఏటుకూరి రామారావు, రచ్చా నర్సింహారావు, గుడవర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెంలో..

తిరుమలాయపాలెం: తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని మండలంలోని తిరుమలాయపాలెంలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి శ్రీను, తుళ్లూరి నాగేశ్వరరావు, రాము, మధు, కొమ్ము కిరణ్, నాగరాజు, రాఘవులు పాల్గొన్నారు.

15 సీట్లు కేటాయించాలి



స్క్రీనింగ్ కమిటీ బాధ్యులతో ముస్లింలు

ఖమ్మంసహకారనగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో ముస్లిం, మైనార్టీలకు 15 అసెంబ్లీ సీట్లు కేటాయించాలని హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో స్క్రీనింగ్ కమిటీ బాధ్యులకు విన్నవించినట్లు కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్ తెలిపారు. రాష్ట్రంలో 40 నియోజకవర్గాల్లో ముస్లింల నిర్ణయాత్మక శక్తి ఉందని, ఈ నేపథ్యంలో కనీసం 15 నియోజకవర్గాల్లో ముస్లిం, మైనార్టీలకు సీట్లు కేటాయించాలని కోరినట్లు తెలిపారు.

భైరవునిపల్లిలో యూత్ కార్యాలయం ప్రారంభం

నేలకొండపల్లి: మండలంలోని భైరవునిపల్లి గ్రామంలో బాబూజగ్జీవన్‌రాం, అంబేడ్కర్ యూత్ కార్యాలయాన్ని సర్పంచ్ పెద్దపాక గురవమ్మ ప్రారంభించి మాట్లాడారు.. గ్రామంలోని యూత్ సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి ఫలాలు అందరికీ అందేలా చూడాలని పేర్కొన్నారు. ప్రజలను చైతన్యం చేసే కార్యక్రమాలు చేపట్టి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ ఐడియాలజిస్ట్ పెద్దపాక వెంకటేశ్వరరావు, పెద్దపాక ఆనందరావు, పెద్దపాక ముత్తయ్య, ఉపేందర్, గోపి, సైదులు, రాంబాబు, వీరబాబు, నాగరాజు, జానపద కళాకారుడు పెద్దపాక విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

నేలకొండపల్లి/కూసుమంచి: ఖమ్మంరూరల్ డివిజన్ పరిధిలో ఈ నెల 11వ తేదీ నుంచి 13 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టీఎస్ఎన్‌పీడీసీఎల్ ఏఈ కె.రామారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నేలకొండపల్లి, కూసుమంచి, పాలేరు, రాజేశ్వరపురం, ఖమ్మంరూరల్ పరిధిలోని గ్రామాల వ్యవసాయ అవసరాలు, పారిశ్రామిక విద్యుత్ సరఫరాలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందని, గృహ విద్యుత్ వినియోగదారులకు యథాతథంగా సరఫరా జరుగుతుందని వివరించారు.

సభకు తరలిన ముస్లింలు



ప్రార్థన చేస్తున్న ముస్లింలు

ఖమ్మంమామిళ్లగూడెం: జేయూహెచ్ ఆధ్వర్యంలో నల్లగొండ జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ సెంటర్ మైదానంలో నిర్వహించే ధార్మిక బహిరంగ సభకు ఖమ్మం నుంచి ముస్లింలు తరలివెళ్లారు. ఆదివారం కాల్వొడ్డులో జేయూహెచ్ జిల్లా అధ్యక్షుడు మౌలానా సయీద్ అహ్మద్ ఖాస్మీ జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. సభ విజయవంతం కావాలని మౌలానా అబ్దుల్ ఘని ప్రార్థన చేశారు. ఎండీ అసద్, హాఫీజ్ మహ్మద్ జవ్వాద్ అహ్మద్ పాల్గొన్నారు.

ఖమ్మం బీజేపీ టికెట్ కోసం దరఖాస్తు



దరఖాస్తు చేస్తున్న శీలం పాపారావు

ఖమ్మంమామిళ్లగూడెం: ఖమ్మం అసెంబ్లీ స్థానానికి బీజేపీ నుంచి పోటీ చేసేందుకు పలువురు పార్టీ నేతలు ఆదివారం రాష్ట్ర కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నారు. నగరానికి చెందిన ప్రముఖ వైద్యుడు, బీజేపీ జిల్లా నాయకుడు డాక్టర్ శీలం పాపారావుతో పాటు ఆయుష్మాన్ భారత్ జిల్లా కన్వీనర్ పసుమర్తి సతీశ్, వెంకటరెడ్డి దరఖాస్తు చేసుకున్నారు.

న్యాయవాది దరఖాస్తు

ఖమ్మంలీగల్: బీజేపీ తరఫున ఎన్నికల్లో పోటీ చేసేందుకు న్యాయవాది స్వర్ణకుమారి హైదరాబాద్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఆమె మధిర, సత్తుపల్లి అసెంబ్లీ నియోజకవర్గాలకు దరఖాస్తు చేశారు.

ఓట్లు కొనకుండా గెలవాలి



ప్రసంగిస్తున్న ఆవుల అశోక్

రఘునాథపాలెం: జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేశామని చెబుతున్న ప్రజాప్రతినిధులు వచ్చే ఎన్నికల్లో డబ్బు, మద్యాన్ని వినియోగించకుండా గెలవాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆవుల అశోక్ సవాల్ విసిరారు. ఆదివారం రఘునాథపాలెం మండలం మంచుకొండ గ్రామంలో ఖమ్మం డివిజన్ పీవైఎల్ మహాసభలో పాల్గొని ప్రసంగించారు. పాలకులు నిత్యం అభివృద్ధి మంత్రం జపిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని, రాష్ట్రంలో పదేళ్లలో ఏఒక్క పథకం వందశాతం అమలు చేయలేదని ఆరోపించారు. సీఎం కేసీఆర్ ఈ తొమ్మిదేళ్లలో ఎన్ని ఉద్యోగాలు నింపారో.. ఎందరికి నిరుద్యోగ భృతి ఇచ్చారో తెలపాలని డిమాండ్ చేశారు. జిల్లాలో మత్తు పదార్థాలను యువత విచ్చలవిడిగా వినియోగిస్తోందని, వీటిని అరికట్టాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రజాపంథా, అనుబంధ సంఘాల నేతలు టి.ఝాన్సీ, మంగతాయి, రాకేశ్, ప్రేమ్‌సింగ్, భరత్, లక్ష్మణ్ తదితరులు ప్రసంగించారు. అనంతరం పీవైఎల్ ఖమ్మం డివిజన్ అధ్యక్షుడిగా జాటోత్ ప్రేమ్‌సింగ్, కార్యదర్శిగా జక్కుల భరత్‌తోపాటు 17 మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

క్రికెట్ పోటీలను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న తాతా మధు

ఖమ్మంలీగల్: వచ్చే నెల 6, 7, 8 తేదీల్లో నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో రాష్ట్రస్థాయి క్రికెట్ టోర్నమెంట్ (డే/నైట్) నిర్వహిస్తున్నామని, రాష్ట్రంలోని అన్ని బార్ అసోసియేషన్‌లకు సంబంధించిన న్యాయవాదులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ తాతా మధు కోరారు. ఆదివారం తన నివాసంలో తాళ్లూరి సుహాస్ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ తాళ్లూరి దిలీప్‌చౌదరి, ఇతర న్యాయవాదులతో కలిసి టోర్నమెంట్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లాలో గతంలో కూడా న్యాయవాదులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా క్రికెట్ పోటీలు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎక్కిరాల రాంబాబు, కృష్ణారావు, సింగం జనార్దన్ పాల్గొన్నారు.

న్యూ ఇరా స్కూల్లో పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

ఖమ్మంగాంధీచౌక్: జిల్లా కేంద్రంలోని న్యూఇరా పాఠశాల పూర్వ విద్యార్థి ఇంజం నిశాంత్ రచించిన 'ద బెస్ట్ పాసిబుల్ ఎక్స్‌పీరియన్స్' పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో సాహితీవేత్త, విమర్శకులు ఏవీ రమణమూర్తి, కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యుడు ప్రసేన్, కవి సీతారాం తదితరులు పుస్తకాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. అనంతరం న్యూఇరా విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ పి.భూమేశ్వరరావు మాట్లాడుతూ.. ఈ పుస్తకం అత్యధికంగా అమ్ముడయ్యే పది పుస్తకాల జాబితాలో చోటు సంపాదించుకోవడం గర్వకారణమని తెలిపారు. అలాగే, విద్యాసంస్థల చైర్మన్ ఇంజం వెంకటరమణరావు మాట్లాడగా విద్యార్థిని కె.స్వాత్య ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది.

ఘనంగా వనసమారాధన



వనసమారాధనలో సందడి చేస్తున్న గ్రామస్తులు

ఖమ్మంరూరల్: మండలంలోని కామంచికల్ శివారు పాటివారిగూడెంలో ఆదివారం వనసమారాధన నిర్వహించారు. గ్రామంలోని ప్రజలందరూ కులమతాలకతీతంగా సమీపంలోని మామిడితోటకు వెళ్లి ఉల్లాసంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం సమయంలో చిన్నారులు, యువకులు, యువతులు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేవారు.

వైద్యశిబిరం విజయవంతం



ప్రజలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నేలకొండపల్లి: మండల కేంద్రంలో నూతక్కి గంగాధర్‌రావు సేవా కమిటీ ఆధ్వర్యంలో రావెళ్ల భవన్‌లో ఆదివారం నిర్వహించిన నెలనెల వైద్య శిబిరం విజయవంతమైంది. మొత్తం 181 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. గ్యాస్, షుగర్, బీపీ జబ్బులకు మందులను అందించారు. వైద్యులు కొల్లి అనుదీప్, గుడిపూడి రాజేశ్, హస్సన్‌బాబాతోపాటు, బండి పుష్పలత, నాగేశ్వరరావు, తానీషా, వసుంధర కాలేజీ ప్రిన్సిపాల్ ఈగ అనిల్‌కుమార్, ఏటుకూరి రామారావు, కేవీ రెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు, దుగ్గి వెంకటేశ్వర్లు, శీలం అప్పారావు, దండా సూర్యనారాయణ, వల్లంచెట్ల భాస్కర్‌రావు, అపర్ణ, సతీశ్, యం.నర్సింహారావు, భార్గవ, మల్లికార్జున్ పాల్గొన్నారు.


రాజకీయంగా ఎదగాలి



అభివాదం చేస్తున్న సంజీవరావు, నాయకులు

రఘునాథపాలెం: జనాభాలో అత్యధికంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు రాజకీయంగా ఎదగాల్సిన అవసరముందని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహాసేన జిల్లా అధ్యక్షుడు మంద సంజీవరావు అన్నారు. మహాసేన ఏర్పాటై ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం ఖమ్మంలోని మయూరి సెంటర్ నుంచి రఘునాథపాలెం మండలం మంచుకొండ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మంచుకొండలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంజీవరావు మాట్లాడారు.. మహాసేన ద్వారా గడిచిన ఐదేళ్లలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని, సభ్యుల సహకారంతో కరోనా సమయాన బాధితులకు అండగా నిలిచామని తెలిపారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు ఎం.తిమోతి, డాక్టర్ సెబాస్ స్టీఫెన్, ధరావత్ మోహన్‌నాయక్, బండారి ప్రభాకర్, ఎస్‌కే ఇసాక్, అంగడాల అనిల్, పసలపూడి రమేశ్, మారపాక పృథ్వీ, పరకాల ప్రవీణ్, ఇమ్మాన్యుయేల్, యాకోబ్, జీవరత్నం పాల్గొన్నారు.

రామాలయంలో సర్వైశ్వర్య హోమం



మాట్లాడుతున్న అమృత ప్రాణ మాతాజీ

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని ఎన్నెస్పీ క్యాంపు రామాలయంలోని సర్వైశ్వర్య హోమం దీప పూజ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాతా అమృతానందమయి ఆశ్రమ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఇన్‌చార్జ్ స్వామిని సువిధామృత ప్రాణ మాతాజీ హాజరై భక్తులకు సందేశమిచ్చారు. ఆధ్యాత్మిక భావన పెరిగే విధంగా తల్లిదండ్రులు కృషి చేయాలని, ప్రతి ఒక్కరు సేవా భావాన్ని కలిగి ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కూసంపుడి శ్రీనివాసరావు, కాటేపల్లి లక్ష్మీనారాయణ, మందడపు రామారావు, అల్లిక అంజయ్య, పెరిక బాలాజీ, హరిగోపాల్, మూర్తి, వడ్లమూడి సురేశ్, రాయల సీతయ్య పాల్గొన్నారు.

ఆలయాల్లో బోనాల సందడి



కారేపల్లి: బోనాలతో వస్తున్న మహిళలు

ఖమ్మంఅర్బన్, రఘునాథపాలెం: శ్రావణ మాసం చివరి ఆదివారం కావడంతో అమ్మవార్ల దేవాలయాల వద్ద బోనాలతో భక్తులు బారులుదీరారు. నగరంలోని ఇందిరానగర్, మధురానగర్, బల్లేపల్లి, రఘునాథపాలెం మండలం రఘునాథపాలెం, రేగులచెలక, కోటపాడు, మంచుకొండ, బూడిదంపాడు, పంగిడి, ఈర్లపుడి గ్రామాల్లోని ఆలయాల వద్ద మొక్కులు చెల్లించారు.

జాస్తిపల్లిలో..

కామేపల్లి(కారేపల్లి): జాస్తిపల్లి గ్రామంలో ఆదివారం బోనాలు నిర్వహించారు. మహిళలు బోనాలతో ముత్యాలమ్మ గుడి వద్దకు చేరుకొని మొక్కులు చెల్లించారు. కళావతి, బత్తుల పుల్లయ్య, మల్లెంపాటి శ్రీనివాసరావు, దేవండ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

కూసుమంచి మండలంలో..

కూసుమంచి: శ్రావణ మాసం చివరి ఆదివారం కావడంతో మండలంలోని పలు గ్రామాల్లో ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. కోళ్లు, పొట్టేళ్లు బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.